క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు మౌనిక ఎంపిక


మౌనికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పాములవాక కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆర్.మౌనిక ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఆమెను శుక్రవారం అభినందించారు. మౌనికను ఆదర్శంగా తీసుకుని మిగతా విద్యార్థులు విద్యలో రాణించాలని కోరారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యేంత వరకు ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం వస్తుందని హెచ్‌ఎం తెలిపారు. పీడీ వి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు రామారావు, రామలక్ష్మి, సుజాత, దేవుడు, రాము, వరప్రసాద్.. మౌనికను అభినందించారు.

పోషకాహారం శ్రేయస్కరం


తోటాడలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మండలంలోని తోటాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంచారం చికిత్సా శిబిరంలో ఆమె వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, తాజా ఆహారం శ్రేయస్కరమన్నారు. దీనికి తోడు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వేసవిలో ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటీశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, సీహెచ్‌వో యామిని ప్రియాంక, ఏఎన్‌ఎం రమణి, హెల్త్ అసిస్టెంట్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

11న పోలిపల్లి అమ్మవారి పండగ


మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లి ఏటి బ్రిడ్జి వద్ద ఈ నెల 11న పోలిపల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ బుద్ద రవి శంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 11 గంటలకు విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పాత బగ్గాం కళాకారులతో రేలారే రేలా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని రవిశంకర్ కోరారు.

పాఠశాలలో దంగల్ సినిమా ప్రదర్శన


దంగల్ సినిమాను వీక్షిస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం దంగల్ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ జి.అప్పన్న మాట్లాడుతూ బాలికల్లో చైతన్యం కల్పించడం, తగు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. బాలికలకు పాఠశాలలకు వెళ్లేటప్పుడు ఎవరైనా ఇబ్బంది పెడితే ముందుగా తల్లిదండ్రులకు తెలియజేసి, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పురుషోత్తం, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డస్ట్‌బిన్ల పంపిణీ


గుంటపల్లిలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి, మంగవరం, కేశవరం, రాజవరం పంచాయతీల్లో ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తను సేకరణ కోసం డస్ట్‌బిన్‌లు పంపిణీ చేసినట్టు ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్దనున్న తడి, పొడి చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించే పని పంచాయతీ సిబ్బంది చేపట్టాలన్నారు. గ్రామాల్లో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు.


యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు.!


ఎడ్ల బళ్లతో ఒడ్డుకు చేర్చి ట్రాక్టర్లతో ఇసుకను రవాణా చేస్తున్న దళారులు

- వరాహనదిలో కట్టడాలకు ముప్పు
- పట్టించుకోని అధికారులు


దార్లపూడి సమీపంలో వరాహ నదిలో నీటి అడుగు నుంచి ఇసుక తీస్తున్న దృశ్యం


ఇసుక తవ్వకాలు చేపడుతున్న సమీపంలో ఉన్న పులపర్తి ఆనకట్ట


ఇసుక తవ్వకాల సమీపంలో పోలవరం కాలువ నది దాటే అక్విడెక్ట్

ఎస్.రాయవరం: మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఇళ్ల నిర్మాణం చేసుకునేవారు నేరుగా నదిలో నుంచి ఇసుక తీసుకోవచ్చని వెసులుబాటు ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని పలువురు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇసుక రవాణాపై అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో నదిలో విచ్చలవిడిగా దొరికిన చోట ఇసుక తరలించి భవన నిర్మాణదారులకు విక్రయిస్తున్నారు. ఇంతవరకు పాయకరావుపేట నియోజకవర్గంలో కోటవురట్ల మండలంలో వరాహనదిలో పందూరు, గొట్టివాడ ప్రాంతాల్లో ఇసుక తవ్వి తెచ్చేవారు. ఆ ఇసుక పట్టణాలకు తరలిపోవడంతో అక్కడ ఇసుక అయిపోయింది. ఇప్పుడు కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల సరిహద్దు ప్రాంతం ఇందేశమ్మవాకలో నదిలో నీరు ఉన్నప్పటికి నాటుబళ్లతో ఇసుకను ఒడ్డుకు చేర్చడం.. అక్కడి నుంచి ట్రాక్టర్లతో తరలించకపోవడం నిత్యకృత్యంగా మారింది. ఈ ప్రాంతంలో ఇసుక తీసేందుకు వీలు లేదని చెప్పినప్పటికీ అక్రమార్కులు ఆగడం లేదు. ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాల వల్ల సమీపంలో మినీ బ్యారేజ్ పులపర్తి ఆనకట్ట, నదిపై పోలవరం కాలువ, నది దాటేందుకు నిర్మాణంలో ఉన్న అక్విడెక్ట్‌లకు ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తవ్వడం వల్ల రాళ్లు తేలి నది గర్భం కోతకు గురైంది. ఇదే పరిస్థితి కొనసాగితే నదిలో ఉన్న పలు నిర్మాణాలకు ముప్పు పొంచి ఉంది. ఇసుక ఉన్న చోట తవ్వకాలు చేపట్టాలని, నదిలో సాగునీటి కట్టడాలు ఉన్న చోట తవ్వకాలు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ జలాలకు ముప్పు

నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు దెబ్బతింటున్నాయి. అధికారులు రీచ్‌లు కేటాయించిన దగ్గర ఇసుకను తవ్వుకోవాలి. ఇప్పటికే మండలంలో ఇసుక తవ్వకాల వల్ల నది గట్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. – కోన బాబూరావు, రైతు

ఉచిత ఇసుకకు అనుమతి ఇవ్వలేదు..



మండలంలో ఉచిత ఇసుక తీసేందుకు వరాహనదిలో రీచ్‌లు లేవు. అవసరం ఉన్నవారిని కోటవురట్ల మండలం పందూరు, గొట్టివాడ రీచ్‌ల నుంచి తెచ్చుకోవాలని చెప్పాం. నదిలో ఆనకట్టలు, గట్టుల వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. దార్లపూడిలో ఇసుక తీస్తున్నట్టు సమాచారం లేదు. ఉచిత ఇసుక కోసం ఇంత వరకు ఒక్క అనుమతి కూడా నా వద్ద తీసుకోలేదు. ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.
– జె.రమేష్‌బాబు, తహసీల్దార్,ఎస్.రాయవరం మండలం

ప్రసూతి విభాగంలో వసూళ్లపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..


యలమంచిలి సీహెచ్‌సీలో అక్రమ వసూళ్లపై సాక్షిలో ప్రచురితమైన కథనం

యలమంచిలి రూరల్: యలమంచిలి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ప్రసూతి విభాగంలో అక్రమంగా డబ్బుల వసూళ్లపై వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో వైద్యం కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్న వ్యవహారంపై శుక్రవారం సాక్షి పత్రికలో 'కాసుపత్రి' శీర్షికన ప్రచురితమైన కథనం జిల్లా వైద్య ఆరోగ్యం, వైద్య విధాన పరిషత్ శాఖల్లో కలకలం సృష్టించింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని వైద్య విధాన పరిషత్ కో‌ఆర్డినేటర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కూడా సాక్షిలో వచ్చిన కథనంలోని అంశాలపై ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మరోవైపు అక్రమ వసూళ్ల ఆరోపణలకు సంబంధించి తక్షణమే వివరణ ఇవ్వాలని ఆస్పత్రి పర్యవేక్షకుడు, గైనకాలజిస్టులను ఉన్నతాధికారులు ఆదేశించారు. యలమంచిలి ఆస్పత్రిలో వైద్య సేవలకు డబ్బులు వసూలు చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామని వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్ శుక్రవారం రాత్రి సాక్షికి తెలిపారు.

బార్క్ ప్రహరీ నిర్మాణ పనులు అడ్డగింత

- పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలి
- రావిపాలెం గ్రామ బార్క్ నిర్వాసితుల డిమాండ్


బార్క్ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

అచ్యుతాపురం రూరల్ : బార్క్ ప్రహరీ నిర్మాణ పనులను రావిపాలెం గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. తమకు పరిహారం ఇచ్చి, సమస్యలు పరిష్కరించాకే పనులు చేపట్టాలని భీష్మించారు. గ్రామస్తుల ఆందోళనకు జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, పశు పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించకుండా గ్రామం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. 2014లో అప్పటి ప్రభుత్వం రావిపాలెంలో బార్క్ కాలనీ కోసం భూసేకరణ చేసిందన్నారు. నేటికీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. సుమారు 600 కుటుంబాలు నివాసముండే గ్రామాన్ని సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణానికి తరలించి గ్రామస్తులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎటువంటి చర్చలు జరపకుండా దౌర్జన్యంగా ప్రహరీ నిర్మాణ పనులు చేపడితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీ-4 సర్వే వేగవంతం చేయాలి


మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పీ-4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులకు కేటాయించిన సచివాలయాల పరిధిలో సర్వే సక్రమంగా జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలను సేకరించి మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. అధికారులంతా సమన్వయం చేసుకొని సర్వే పక్కాగా జరిగేందుకు సహకరించాలన్నారు. తహసీల్దార్ ఆది మహేశ్వరరావు, మునగపాక, చూచుకొండ వైద్యాధికారులు నంది విమలగిరి, ఎస్తేర్‌రాణి, ఈవోఆర్డీ ఎం.సోమరాజు, వెలుగు ఏపీఎం బాలరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై కేసులు రద్దు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బాధితులు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేటలో అటవీ శాఖ అధికారులు మత్స్యకారులపై నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని బాధితులతో పాటు సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ నర్సింహమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రాజయ్యపేటలో సర్వే నంబరు 289లో రెండు దశాబ్దాల నుంచి గ్రామానికి చెందిన మత్స్యకారులు తాటాకు ఇళ్లు, రేకుల షెడ్లు నిర్మించుకుని జీవిస్తున్నారన్నారు. ఈ స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు పన్నులు చెల్లిస్తున్నారని, రేషన్ కార్డులు, ఆధార్‌కార్డులు, విద్యుత్ బిల్లుల సైతం అదే చిరునామాతో పొందారని చెప్పారు. ఇటీవల అటవీశాఖ అధికారులు వచ్చి వారిపై కేసులు నమోదు చేసి నివాస ప్రాంతాలను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు అటవీ భూములపై ఎటువంటి హక్కు ఉంటుందో సముద్ర తీర ప్రాంతాల్లో భూములు అనుభవించే హక్కు మత్స్యకారులకు ఉంటుందని చెప్పారు. ఖాళీగా ఉన్న భూముల్లో తాత్కాలికంగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న వారిపై అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిరిగేలా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే ఈ కేసులు రద్దు చేసి, స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో పారిశుధ్య పనుల పరిశీలన


ఉపమాకలో శానిటేషన్ సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో శిరీష

నక్కపల్లి: ప్రముఖ పుణ్య క్షేత్రం ఉపమాక కల్యాణోత్సవాల సందర్భంగా చేపట్టిన పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి శిరీష శుక్రవారం పరిశీలించారు. ఉపమాక ఆలయ పరిసరాలతో పాటు, మాడవీధులు, నక్కపల్లి నుంచి ఉపమాక వెళ్లే మెయిన్‌రోడ్డు, సారిపల్లిపాలెం రోడ్డు, రాజయ్యపేట రోడ్డు, బందర సరస్సు, తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా నియమించిన శానిటేషన్ సిబ్బంది ద్వారా పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని 15 రోజుల పాటు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఉపమాకలో మొత్తం వీధుల్లో బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించాలన్నారు. బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, స్వీపర్లు, శానిటేషన్ సిబ్బందిని ఉపమాక కల్యాణోత్సవాలు ముగిసే వరకు అందుబాటులో ఉండాలన్నారు. నక్కపల్లి నుంచి ఉపమాక వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

టి.సిరసపల్లి పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత


ఎన్‌ఆర్‌ఐ నాయుడు సమకూర్చిన ఊయల వద్ద చిన్నారుల సందడి

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పాలమరశెట్టి చిన అప్పారావు కుమారుడు ఎన్‌ఆర్‌ఐ నాయుడు రూ.62 వేలతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ మేరకు శుక్రవారం క్రీడా సామగ్రిని ప్రారంభించారు. విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఊయల, జారుడు బల్ల, రంగుల రాట్నం వంటి వాటిని ఎంఈవో బుద్ద శివనాయుడు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శివనాయుడు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం జి.మల్లేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ పాలమరశెట్టి ఆనందరావు, సీఆర్‌ఎంటీ మద్దాల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు రేపు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్(తోసా) అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. తోసా ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సదస్సు ఉంటుందన్నారు. ప్రముఖ ఎడ్యుకేషనల్ సైకాలజిస్టు జేఎస్‌వీ రావు ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

అచ్యుతాపురం రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. వేతనాలు పెంచి ఆదుకోవాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు అందక కుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. కనీస వేతనంగా నెలకు రూ.15 వేలు అందజేయాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించి, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్‌ఐ, సెలవులతో కూడిన వేతనాల సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం కన్వీనర్ ఆడారి నాగేశ్వరరావు, నాగమణి, శ్రీరాములు, రమణ, కళ్యాణి, జ్యోతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయకుమార్ వ్యాఖ్యలు గర్హనీయం


నర్మాల కుమార్

అచ్యుతాపురం రూరల్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై యలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎమ్మెల్యే మాట్లాడడం దారుణమన్నారు. ప్రశాంతమైన నియోజకవర్గానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా విజయకుమార్ మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లో అచ్యుతాపురం సెజ్‌లో మూతపడిపోతున్న పరిశ్రమలను ఎందుకు తెరిపించి ఉపాధి కల్పించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులతో చర్చించి ఉపాధి కోల్పోతున్న కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఆయన కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ తరలింపునకు చర్యలు


మూలపేట గంగాలమ్మ తల్లి గుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ గోపీ

మునగపాక: మండలంలోని మూలపేట గంగాలమ్మ తల్లి గుడి ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ గోపీ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు తరలించేలా చూడాలని కోరుతూ గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో ఏఈ గోపీ గంగాలమ్మతల్లి గుడి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.